పరీక్ష లయిపోయాయి. శ్రీహరి తిరిగివచ్చాడు. సాటి పంతుళ్ళు చుట్టుముట్టి "ఎలాగుందండీ! ఏమయిందండీ? ఏమిటండీ విశేషాలు?" అని ఒక్క పెట్టున మృత్యు ముఖంనుండి తప్పివచ్చిన అదృష్ట వంతుణ్ణి అడిగినట్టు అడిగారు. ఇంతలో శ్రీహరితో స్నేహంగా ఉండే మాష్టారు అన్నారు వెనకనుంచి:

"ఇంతకీ ఆవిడ తాడు గట్టిది" నవ్వుతూ. అంతా నవ్వారు. దానికి శ్రీహరి ఎంతో తాపీగా ఏమీ భయం అంటే ఎరగనివాడిలా అన్నాడు:

"బలిజేపల్లి అంటే ఎందుకు మీరు అంతగా భయపడుతున్నారో నా కర్థంకాదు. వాళ్ళంత మంచిపిల్లలు మన స్కూలు పిల్లలు కూడా కారు."

"నిజంగానా?" అని ఆశ్చర్యపోయారు.

ఆ సాయంత్రం శ్రీహరి విష్ణుమూర్తి యింటికి పోయి విష్ణుమూర్తితో అన్నాడు—

"ఒరే! పాపం! ఆయన 'రిలీఫ్' లోనే వేసాడ్రా! నీ మేలు మరవను."

"ఇందులో ఏముంది పెద్ద! మా పెద్దనాన్నా, మీ చీఫ్, మనం ఇద్దరం ఎలా ఉంటామో అలా ఉంటారు. కాస్త ముక్కోగా చెప్పాడు అంతే." శ్రీహరి అక్కడ జరిగిన ఒకటి రెండు విశేషాలు చెప్పి చివరన అన్నాడు:

"కాని విష్ణువూ! చాలామందిని మోసం చేశాను."

"కాదురా! మోసపోయారను!" విష్ణువు నవ్వుతూ అన్నాడు.

---

క థా ని క

# పాఋవేట

## "రత్నం"

ఒక్క కునుకు తీద్దామని పక్కమీద అటూ—యిటూ దొర్లటం తప్పితే ఎంతసేపటికీ నిద్ర పట్టటంలేదు రామిరెడ్డికి. చుక్కపొడిచినప్పుడు అరక గట్టుకొని తెగులు పడిన మిరపచేను పగల దున్ని అలసి—సొలసి వచ్చాడు యింటికి.

ఊహ తెలిసిన దగ్గర్నుంచీ ఈ ఇరవైయేళ్ళ వయసుదాకా పొలం...గొడ్లూ చాకిరీ—ఇవే రామిరెడ్డికి తెలిసింది. అతనిలాగా ఆ వయసులో తిన్నగా కొండ్రవేసే వాళ్ళు ఎవళ్ళూ లేరని చుట్టు పక్కల పేరు. తీరిగ్గా నడుంవాల్చేది పండుగా పబ్బాల్లోనే ఆ ప్రాంతం రైతు. ముందు జొన్న అది పాడయితే వరిగ...లేకపోతే మిర్చి...ఆ తర్వాత శనగ...కొత్తిమిర ఆరుగాలం ఏదో ఒక పైరు వెయ్యాలి. దున్నిన సాళ్ళే నాలుగయిదు సార్లు దున్ని...గొర్రు పన్నివిత్తి గుంటక యీడ్చి చదునుచేసి...లేతపైరు మధ్య దంతెతో మళ్ళా దున్ని ఎంతో శ్రమపడాలి. అదనుకు వర్షాలు కురిస్తే...గాలిపాటు సరిగ్గా ఉంటే భూమాత పసిడిపంట నిస్తుంది. నాలుగు వేళ్ళూ లోపలికి పోతాయి. ప్రకృతి ఉత్పాతాలకు గురయి తమ కష్టఫలితం దక్కకపోయినా...శతాబ్దాలనుంచి ఆ యీతిబాధలకు అలవాటు పడిన రైతులు ఒక్క నిట్టూర్పన్నా విడవరు. మళ్ళా పగల దున్నటం...ఇంకో పైరు వేయటం...శ్రమ... ఉత్త శ్రమ! అదే తెలిసింది వాళ్ళకి!

వరిగబువ్వలో ఇంత గోంగూర పచ్చడేసుకొని గడ్డ పెరుగుతో జుర్రి...ఊరు మాటుమణక్క ముందే...నులక మంచంమీద గడ్డిదిండేసుకొని... నడ్డివాల్చి గుఱ్ఱుకొడుతుంటే రోజూ ఎటుపోయేదో ప్రాణం! కాని యివ్వాళ ఎంత తన్నుకున్నా మగతనిద్ర తప్పితే సరిగ్గా నిద్రపట్టటంలేదు రామిరెడ్డికి.

ఆ కోడినిద్రలో ఎన్నో ఆవేశ భావాలు... తియ్యతియ్యని కలలు...ఈయేడు కూడా పాఋ వేటలో గెలిచినట్టూ...గొఱ్ఱెను భుజాన వేసు కొస్తూంటే...బావా...! బావా...!—అంటూ సీతాయి తనవంక ఫులుకుఫులుకునా చూసినట్టూ— ఎన్నో అనుభూతులు! మెలిదేరిన కండలు...

నూనూగు మీసం...తన విజయగర్వం చూసి సాహసగాళ్ళంతా ఈర్ష్యపడాలి ... వయసుకత్తెలందరికీ మైమఱపు కలిగించాలి—చీకిరి బాకిరిగా... అస్పష్టంగా క్షణక్షణం మారుతూ ఒకటే కలవరింతలు తెల్లవార్లూ రామిరెడ్డికి.

మంచుతెర విడిపోయినట్టు ఏదో చప్పుడు విన్పించి ఊహాలు...కలవరింతలు చెదిరిపోయినయ్. తల్లి పొయ్యి రాజెయ్యటానికి పుల్లలు విరుస్తోంది. వేపచెట్టుమీది కాకులు తపతప ఱెక్కలు కొట్టుకొని గునిసినయ్. దూరాన ఏదో కేక సన్నగా విన్పిస్తోంది. గుఱొయ్యలు నెత్తిమీదికి వస్తున్నయ్. బద్ధకంగా...మూలుగుతూ నిండా ముసుగు లాక్కున్నాడు రామిరెడ్డి. పొయ్యి భగ...భగ మండుతోంది. మూడంకెవేసి ముసగదీసుకొన్నా మళ్ళా కళ్ళు మూతబడలేదు. బుర్ర ఆలోచనల్తో వేడెక్కిపోయింది. ఎంత గుర్తుకు తెచ్చుకుందామన్నా కన్న కలలన్నీ ఏదో అనుభూతిగా తప్ప వరసగా గుర్తుకు రావటంలేదు.

సజ్జరొట్టెలు కాల్చిన వాసన నాసాపుటాల్లో ఘుమఘుమల్ని రేపుతోంది. కళాపెళా ఉడికే వఱిగబువ్వ ఆదో సంగీతాన్ని నింపుతోంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో ప్రకృతి మేల్కొన్నట్టు కాసేపటికి కోళ్ళ పొలికేకలు మొదలెట్టినయ్... ఒళ్లు విరుచుకుంటూ లేచాడు రామిరెడ్డి.

• • •

తూర్పున ఆకాశం ఎఱ్ఱబడింది. నల్లమల కొండలమీదుగా...చెట్ల మధ్యగా పచ్చటి పైరుల పైన కాంతిరేఖలు అలుముకొన్నయ్. బారెడు పొద్దెక్కేప్పటికి రచ్చచావిడి దగ్గఱకు గుంపులు గుంపులుగా చేరేరు జనం. రేలాకుల చుట్ట గుప్పు గుప్పుమనిపిస్తూ...ఠీవిగా తలపాగా జుట్టి ఊరి పెద్ద అంజిరెడ్డి కూడా వచ్చాడు. సజ్జరొట్టెలూ కుడుంలూ నముల్తూ పిల్లలు అటూ యిటూ పరుగెడుతున్నారు. కేకలేస్తూ సంబరాన్ని సాగదీస్తున్నారు పంచె లెగగట్టి...పొన్న కఱ్ఱలుబట్టి... పెత్తనగాళ్ళు.

దప్పుల మోతతో చెవులుదిబ్బెళ్లుపడ్తుతున్నయ్. కొమ్ము బూరాలు. శంఖాలు రాంఢోళ్ళు ఒకటే మోత పెడుతున్నయ్. గణాచారి శివమెత్తి చిందులు తొక్కుతున్నాడు. తుపాకులు...కత్తులు బళ్ళేలు...గొడ్డళ్లు అన్నిటికీ పసుపు పూసి... కుంకమ బొట్లు పెట్టి ఊరేగిస్తూ పోతున్నారు జనం. మెళ్ళో వేపమండలు గట్టి పసుపు కుంకుమలు మొఖాన బెత్తెడెత్తున పూసి ఓ గొఱ్ఱెను నెట్టుకు పోతున్నారు మధ్యలో మూకుట్లోనుంచి సాంబ్రాణి పొగ...గుగ్గిలం వాసన పత్తి మండల పంచల క్రిందుగా మిద్దెల్లోకి జొరబడుతోంది. ముంగిళ్ళన్నీ ఎర్రమన్ను అలికి ముగ్గులు పెట్టి ఉన్నయ్. గొఱ్ఱె బిత్తర బిత్తర చూపులు చూస్తూ...అరుస్తూ హడిలి పోతున్నది. అడుగడుగునా నల్లరాళ్లు...ఎగుడు దిగుళ్లు దిక్కులు చూసి నడిస్తే బోర్లపడే ఆ బజార్లలో—దేన్నీ లక్ష్యం చేయకుండా సంబరం ముందుకు సాగిపోయింది.

ఊరంతా జమ్మిచెట్టు క్రిందికి జేరింది. ఆడా మగా.. పిల్లా జెల్లా-ఒకటే కోలాహలం. కేరింతలు జమ్మికాండం చుట్టూ పసుపు పూసి కుంకుమ తీర్చారు.

'శమీ శమయతే పాపం...ప్రియదర్శనం'—శ్లోకం వ్రాసిన కాగితాలు అందరికీ పంచిపెట్టేడు పురోహితుడు. బంతిపూలు తురుముకొన్న పడతులు, కైపెక్కినట్టు వాళ్ళవైపు చూసే కోడెగాళ్ళు...పరాచికాలాడుతూ సరదాగా చూస్తున్న ముసలివాళ్లు పెత్తనాలు చెలాయిస్తున్న పెద్దరెడ్లు.... ఆవేశంతో—కేకల్తో అల్లడ కల్లడ అవుతున్నారు.

ఏటా పందెంలో గెల్చే రామిడ్డిని ఈసారి ఓడించాలని గొల్ల భీమన్న...వడ్డెరామన్న ఊళ్ళో వేడిపుట్టిన చేవగల వాళ్ళంతా పందేనికి తయారయ్యారు. గోశలు బిగ గట్టి కోర మీసాలు మెలేస్తూ బీరాలు పలుకుతున్నారు.

ఎదురుగా కొండబోడు. నల్లరాళ్ళమీద సూరీడి కిరణాలు తళుకు లీనుతున్నయ్. విష ముష్టి కాయలు...ఎఱ్ఱగా.. నెత్తుటి ముద్దల్లా ఆ యెండలో మెరిసి పోతున్నయ్. అంతా చింపి అడవి రేగు పొదలూ జింకు ముళ్ళపొదలూ, నల్లింగి పాల బరంకీ చెట్లమధ్య గొఱ్ఱెలమంద దప్పుల చప్పుడు విని మోరలెత్తి...బెదురుగా చూస్తున్నయ్ ధ్వని వచ్చేవైపు. గొల్లలు మళ్లేస్తున్నారు మంద చెదిరి పోకుండా. ఆ పాఱువేట పందెంలో పాల్గొనే గొఱ్ఱె ఆ మందలోదే. కొండబోడుకు ఎదురుగా తిప్పేరు గొఱ్ఱెల మంద కన్పించేట్టు.

అంతా ఓ ప్రక్కకు సర్దుకున్నారు. కోర మీసాలు మెలేస్తూ వరసగా నిలబడ్డారు పందెగాళ్ళంతా. ఒక్కో పందెగాడికి ఒక్కొక్క గుంపు కేపుగాస్తూ రెచ్చగొడుతున్నది. సారా వాసన గాలినే మత్తెక్కిస్తోంది. మా భీమన్న గెలుస్తాడంటే మా రామన్నదే యీ సారి ఛాన్సని వాదించుకొంటున్నారు. రామిరెడ్డి దగ్గరే ఎక్కువ గుంపు ఉంది. ఎర్రటి దట్టీ బిగించాడు ... తలగుడ్డ బిర్రుగా చుట్టేడు. చిరుచెమట గమ్మి మెలికలు దిరిగిన కండలు ఎండలో తళుకు...తళుకు మంటున్నయ్. ఆ మెఱుపుల వైపు మిలమిలా చూస్తున్న సీతాయి కళ్ళు రామిరెడ్డి నింకా ఆవేశపరచి ఉన్మాదాన్నెక్కించినయ్.

• • •

చాకలి సూరాయిని పిల్చాడు అంజిరెడ్డి. నలుగురూ గొఱ్ఱెను అదిమిపట్టుకున్నారు కదలకుండా. ఒక్కసారి బేఽఽఽఽ...అన్నది గొర్రె ప్రాణాలు ఎగిరిపోయినట్టు. ఉన్న బెత్తెడు తోక నేలమీద రక్తంతో తడిసిన దుమ్ములో పొర్లింది. రక్తం పొంగి వస్తున్న గాయానికి ఇంత సున్నం కారం పట్టించాడు చాకలి సూరాయి. శంఖాలు కొమ్ము బూరాలు తప్పెట్లు బ్రహ్మాండం బద్దలయినట్టు ధణ ధణ మ్రోగినయ్. గొఱ్ఱెను పది గజాలు మంద వైపు పోనిచ్చారు. భూన భోంతరాళాలు దద్దరిల్లేట్టు పెడదిమ్మె ఢామ్మని మ్రోగింది. పడదోసుకుంటూ పరుగెత్తారు పందెగాళ్లు పట్టుకోవాలని.

జనం ఒకటే కేకలేస్తున్నారు తాగిన మత్తంతా వదిలేట్టు...కంఠనాళాలన్నీ పగిలేట్టు. ఉరకలు తీస్తోంది గొఱ్ఱె...అసలే బెదురుది...తోకదగ్గర మండిపోతోంది...డప్పులు ధణధణమంటున్నయ్.. పెడదిమ్మెదెబ్బ అంతులేని బెదురుని కలిగించింది.

మంద చేరకుండానే పట్టుకోవాలని పందెగాళ్లు. మందచేరితే ఆ గొర్రె గొల్లలకే దక్కుతుంది. పాయివేట గొఱ్ఱెమందలో ఉండటం అదృష్టంగా భావిస్తారు గొల్లలు. ఇంకో గొఱ్ఱెను దానికిమారుగా పెద్దలకు ఇస్తారు. మధ్యలోనే గొఱ్ఱె చిక్కితే మొదటిగా ఏ భాగం పట్టుకుంటే ఆ భాగం పందెగాడికి దక్కుతుంది. మిగతాది గొల్లలూ-పెద్దలూ పంచుకొంటారు. ఆ పందెంలో గెలవటం వీర కృత్యంగా భావిస్తారు జనం. వాణ్ణి గౌరవంగా చూస్తారు. వాడికో ప్రత్యేకత ఉంటుంది ప్రతి సందర్భంలోనూ!

• • •

రామిరెడ్డి ముందు పరుగెత్తే భీమన్నని కాచుకొని ఉరుకుతున్నాడు. రాళ్ళుతగిలి బోర్లపడి వెంటబడేవాళ్ళల్లో . కొంతమంది సర్దుకున్నారు. చెంగున లేడిలా ముందుకు దుమికాడు రామిరెడ్డి గొఱ్ఱెమీదికి. కాలు చిక్కినట్టే చిక్కి జారిపోయింది. వెనకవచ్చే గొల్ల భీమన్న...వడ్డె రామన్న, చాకలి వెంకడూ ఒక్కఊపున రామిరెడ్డి మీదపడి గొఱ్ఱెనందుకోబోయారు. ఎక్కడలేని ఆవేశంతో మళ్ళా పరుగు లంకించుకొన్నారు. ఈలలు... కేకలు... ఒకటేరొద .. జనం కోలాహలం మిన్నుముట్టుతోంది.

ఒక్కసారి...ఉవ్వెత్తున లేచిన జనసముద్ర ఘోష...కొండల్ని అడవిని దద్దరిల్ల జేసింది. రామిరెడ్డి కొండ విరిగిపడినట్టు గొఱ్ఱెమీద పడి నడుంలంకించుకొన్నాడు. గొఱ్ఱెను నెత్తిమీది కెత్తుకొని...ఊపుతూ వచ్చే రామిరెడ్డి వైపు జనమంతా పరుగెత్తారు.

ఊరంతా విజయగర్వంతో...పడుచుతనంతో పరవశుడైన రామిరెడ్డికి హారతులిచ్చింది. కాని రామిరెడ్డికి జీవితమంతా గుర్తున్నది ఒక్కటే: జడలోంచి తీసి సీతాయి తన తలపాగాలో తురిమిన బంతిపువ్వు!

---

1955 డిసెంబరు నెలనాటికి భారత దేశంలోని ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి కార్యాలయాలలో ఉద్యోగాలకోసం 216157 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. వీరిలో 189933 మంది మెట్రిక్యులేట్లు 26224 మంది పట్టభద్రులు ఉన్నారు. స్త్రీలలోకూడ ఉద్యోగాలకోసం తమ పేర్లను నమోదు చేసుకున్న పట్టభద్రుల సంఖ్య 1235. మెట్రిక్యులేషను పాసయినవారి సంఖ్య 9275. అన్ని రాష్ట్రాల కంటె మద్రాసులోని వారికి హెచ్చు ఉద్యోగాలు దొరికాయి.